



ఎలక్ట్రిక్ బైక్‌పై యువతి రయ్‌రయ్..

ప్రమాణ 2K24

జ్యోతి వెలిగించి ప్రారంభించిన ఉపాసన కామినేని


పాటలతో జోష్ పెంచిన రామ్ మిరియాల

'గీతం' ఫెస్ట్‌లో తారల సందడి

గీతం యూనివర్సిటీలో ప్రమాణ 2కే24 ఫెస్ట్ సందడిగా ప్రారంభమైంది. ఉపాసన కామినేని జ్యోతి వెలిగించి ప్రారంభించగా, సింగర్ రామ్ మిరియాల తన పాటలతో జోష్ పెంచాడు. అత్యాధునిక కార్లు, బైకులపై విద్యార్థులు సందడి చేశారు. సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.



పాటలు పాడుతున్న సింగర్ రామ్ మిరియాల





ఆశల పల్లకిలో..!

- నేడు రాష్ట్ర బడ్జెట్‌పై
- సాగునీటి ప్రాజెక్టులకు నిధులిస్తారా?
- సంగారెడ్డి మెట్రోపై ముందడుగు పడేనా?
- మెదక్ మెడికల్ కాలేజీ, రింగ్‌రోడ్డుకు మోక్షం కలిగేనా?

ఆంధ్రజ్యోతి ప్రతినిధి, సంగారెడ్డి, ఫిబ్రవరి 9: అసెంబ్లీలో నేడు ప్రవేశపెట్టనున్న బడ్జెట్ కోసం సంగారెడ్డి, మెదక్ జిల్లాల ప్రజలు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. అభివృద్ధికి నిధుల కేటాయింపులపై ఆశలు పెట్టుకున్నారు. 2024-25 ఆర్థిక సంవత్సరం రాష్ట్ర బడ్జెట్‌ను అసెంబ్లీలో నేడు ప్రవేశ పెట్టనున్నారు. పదేళ్ల తర్వాత అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ హయాంలో జిల్లాకు నిధుల కేటాయింపు ఎలా ఉంటుందోననే ఉత్కంఠ నెలకొన్నది.

సాగునీటి అవసరాలు ఇలా..

సంగారెడ్డి జిల్లాలో సింగూరు ప్రాజెక్టు ఉన్నా సాగుకు నీరందించడంలో ప్రభుత్వాలు నిర్లక్ష్యం వహించాయి. జిల్లా రైతులు ఏళ్ల తరబడి పోరాటం చేయగా సింగూరు ప్రాజెక్టు ద్వారా అందోలు నియోజకవర్గంలోని 40వేల ఎకరాలకు సాగు నీరందించేందుకు రూ.90 కోట్లతో పనులు చేపట్టి దశాబ్దం క్రితం పూర్తిచేశారు. కుడి, ఎడమ కాల్వల ద్వారా ప్రస్తుతం 30వేల ఎకరాలకు సాగునీరందిస్తున్నారు. జిల్లాను సస్యశ్యామలం చేసేందుకు గత ప్రభుత్వం సంగమేశ్వర, బసవేశ్వర ఎత్తిపోతల పథకాన్ని రెండేళ్ల కిందట మంజూరు చేసింది. జిల్లా అంతటా సుమారు 4లక్షల ఎకరాలకు పైగా సాగు నీరందించేందుకు రూ.4వేల కోట్లు అవసరమవుతా యని అంచనా వేసింది. పనులు లాంచనంగా ప్రారంభ మైనా నిధులు స్వల్పంగా సమకూర్చారు. కొత్త ప్రభుత్వ మైనా ఈ పథకానికి అవసరమైన నిధులను కేటాయి స్తుందా? లేదా? అన్నది చూడాల్సి ఉన్నది.

నల్లవాగు ఆధునీకరణ

నల్లవాగు ప్రాజెక్టు కాల్వల ఆధునీకరణకు నాలుగైదేళ్ల కిందట అప్పటి ప్రభుత్వం రూ.24.54 కోట్లు మంజూరు చేసింది. కానీ నిధుల విడుదలలో జాప్యం జరగడంతో చాలాకాలం పనులు మొదలుకాలేదు. ఎట్టకేలకు ప్రారంభ మైనా కొంతమేరకు మాత్రమే పనులు జరిగాయి. ఈ ప్రభు త్వమైనా అవసరమైన నిధులు కేటాయించి సాగుకు నీరం దించాలని ఆయకట్టు రైతులు కోరుతున్నారు.

మెట్రోరైలుకు మార్గం సుగమమయ్యేనా?

పటాన్‌చెరు నుంచి హైదరాబాద్‌కు నిత్యం వేలాదిమంది ప్రయాణిస్తుంటారు. వాహనాల రద్దీతో హైవే సతమతమ వుతున్నది. పారిశ్రామికప్రాంతం కావడంతో ఇక్కడ వేల సంఖ్యలో కార్మికులు నివసిస్తుంటారు. ఈ ప్రాంతంలో ట్రాఫిక్ ఇబ్బందులు కలగకుండా ఉండేందుకు మియాపూర్ నుంచి పటాన్‌చెరు వరకు మెట్రోరైలు ఏర్పాటు చేస్తానని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఇటీవలే ప్రకటించారు. ఇందు కోసం బడ్జెట్‌లో నిధుల కేటాయింపులు జరుపుతారనే ఆశతో ప్రజలున్నారు.

పటాన్‌చెరులో ఆర్డీవో ఆఫీస్ ఏర్పాటుకు డిమాండ్


సంగారెడ్డి జిల్లాలోని ఒక్క పటాన్‌చెరు నియోజకవర్గం మినహా మిగతా అన్ని నియోజకవర్గ కేంద్రాల్లో ఆర్డీవో కార్యాలయాలున్నాయి. జిల్లాలోనే అత్యధికం జనాభా ఉన్న పటాన్‌చెరులో ఆర్డీవో కార్యాలయం ఏర్పాటు చేస్తామని గతే డాది జూన్‌లో అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రకటించారు. కానీ ప్రభుత్వ పరంగా ఇప్పటివరకు ఏ నిర్ణయం వెలువడ లేదు. కాంగ్రెస్ ప్రభుత్వమైనా పటాన్‌చెరులో ఆర్డీవో కార్యా లయం ఏర్పాటుకు నిర్ణయం తీసుకుని, అవసరమైన నిధులు కేటాయించాలని ప్రజలు కోరుతున్నారు.

'ఘనపూర్' ఎత్తు పెంపుపై ఆశలు

మెదక్ జిల్లాకు జీవనాధారమైన ఘనపూర్ ఆనకట్ట ఎత్తు పెంచేందుకు అవసరమైన నిధులు ఇస్తామని ఎనిమి దేళ్ల కిందట అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రకటించారు. కానీ ఇప్పటి వరకు నిధులు విడుదల చేయలేదు. ఆనకట్ట ఎత్తు పెంచకపోవడంతో ఈ ప్రాంతంలో యాభైవేల ఎకరా లకు సాగునీరందకుండా పోతున్నది. కొత్త ప్రభుత్వమైనా ప్రాజెక్టు ఎత్తు పెంపునకు అవసరమైన నిధులను కేటా యించాలని జిల్లా ప్రజలు కోరుతున్నారు.

రింగ్‌రోడ్డు, మెడికల్ కాలేజీపై డిమాండ్లు

శంకుస్థాపనకే పరిమితమైన మెదక్ మెడికల్ కాలేజీని ప్రారంభించాలని ప్రజలు కోరుతున్నారు. ఇందుకు అవసర మైన స్థల ఎంపిక, భవన నిర్మాణాలకు అవసరమైన నిధులను బడ్జెట్‌లో కేటా యించాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు. అలాగే, మెదక్ పట్టణంలో ట్రాఫిక్ రోజు రోజుకు పెరుగుతున్నది. జిల్లాకేంద్రం కావడంతో జనాల రాకపోకలు పెరిగాయి. పక్క జిల్లాలతో మెదక్ జిల్లాను కలిపే ప్రధాన రహదారి పట్టణం మధ్యలో నుంచే ఉండడంతో ట్రాఫిక్ కష్టాలు తప్పడం లేదు. అందుకే మెదక్ పట్టణం చుట్టూ రింగురోడ్డు ఏర్పాటు చేయాలని స్థానికులు ఎప్పటి నుంచో డిమాండ్ చేస్తున్నారు. ఇందుకోసం తాజా బడ్జెట్‌లో కేటాయింపులు ఉంటాయేమోనని ఎదు రుచూస్తున్నారు.



బసవేశ్వర ఎత్తిపోతల పథకాన్ని ప్రారంభిస్తున్న అప్పటి సీఎం కేసీఆర్, మంత్రి హరీశ్‌రావు (ఫైల్)

మంతూరు వద్ద మరో ఎత్తిపోతల పథకం

అందోలులో అదనంగా 40వేల ఎకరాల సాగుకు నీరు ● శ్రీకారం చుట్టిన మంత్రి దామోదర్

ఆంధ్రజ్యోతి ప్రతినిధి, సంగారెడ్డి, ఫిబ్రవరి 9: పుల్కల్ మండలం మంతూరు వద్ద మరో ఎత్తిపోతల పథకం నిర్మిం చాలని ప్రభుత్వం సూత్రప్రాయంగా నిర్ణయించింది. రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సి.దామోదర్ రాజనర్సింహా ప్రాతి నిధ్యం వహిస్తున్న ఆందోల్ నియోజకవర్గంలో 40 వేల ఎక రాల సాగుకు నీరందించే ఉద్దేశంతో ఈ ఎత్తిపోతల పథకం చేపట్టనున్నారు. సింగూరు ప్రాజెక్టు కుడి, ఎడమ కాల్వల ద్వారా ఈ నియోజకవర్గంలోని పుల్కల్, చౌటకూర్, మునిపల్లి మండలాలలోని సుమారు 30 వేల పై చిలుకు ఎకరాలకు ఇప్పటికే సాగు నీరందిస్తున్నారు. ఈ నియోజకవర్గంలో సుమారు లక్షకు పైగా చిలుకు ఎకరాలకు సాగు నీరందించేం దుకు గత ప్రభుత్వం బసవేశ్వర ఎత్తిపోతల పథకం చేపట్టా లని నిర్ణయించింది. ఇందుకు 2022 ఫిబ్రవరిలోనే అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్ నారాయణఖేడ్‌లో శంకుస్థాపన చేసిన విషయం తెలిసిందే. అయితే, ఇప్పటివరకు భూసేకరణ జరప కపోవడం, పనులు చేపట్టకపోవడం వంటి పరిణామాలకు తోడు ప్రభుత్వం కూడా మారిపోయింది. ఈ పరిస్థితులలో కొత్తగా వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం బసవేశ్వర ఎత్తిపోతల పథకం నిర్మాణాన్ని సమీక్షించాలని నిర్ణయించింది. ఈ ఎత్తిపో తల పథకం సంగతెలా ఉన్నా ఈ నియోజకవర్గం నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న దామోదర్ కొత్తగా పుల్కల్ మండలం మంతూరు వద్ద ఎత్తిపోతల ద్వారా పథకం నిర్మిం చేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని నీటి పారుదల శాఖ అధికారులకు సూచించారు. ఈ పథకం ఏర్పాటు కోసం చేసే సర్వేకు అనుమతించాల్సిందిగా లేఖ రాశారు. నీటి పారు దల శాఖ ఇంజనీర్ ఇన్ చీఫ్‌గా కొత్త అధికారి రాగానే మంతూరు ఎత్తిపోతల పథకం ఏర్పాటు సర్వేకు అనుమతి వస్తుందని ఆ శాఖ తెలిపింది.

మెదక్ జిల్లాలో సీఎంఆర్ బకాయి

1,82,365 మెట్రిక్ టన్నులు

2022-23 యాసంగిలో 1,64,370 మెట్రిక్ టన్నులు, వానాకాలంలో 17,995 మెట్రిక్ టన్నుల బకాయి

మెదక్, ఫిబ్రవరి 9: కస్టం మిల్లింగ్ రైస్ సేకరణ గడువును కేంద్రం మరోమారు పొడిగించిన నేపథ్యంలో రైస్ మిల్లర్లకు ఊరట లభించింది. ఇప్పటికే పలుమార్లు గడువు పొడిగించినా స్పందించకపోవడంతో క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని కలెక్టర్ హెచ్చరించడంతో ఆందోళనకు గురైన మిల్లర్లు.. సీఎం ఆర్ గడువును ఈ నెల 29 వరకు పెంచుతున్నట్లు పౌరసరఫ రాలశాఖ ప్రకటించడంతో ఊపిరి పీల్చుకున్నారు.

గత యాసంగి 19 శాతం మాత్రమే..


మెదక్ జిల్లాలో 2022-23 యాసంగి సీజన్‌లో 2,99,858 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని మిల్లర్లకు కేటాయించారు. 2,03,903 మెట్రిక్ టన్నుల సీఎంఆర్ ప్రభుత్వానికి ఇవ్వాల్సి ఉన్నది. కానీ, ఇప్పటి వరకు కేవలం 39,533 మెట్రిక్ టన్నుల (19 శాతం) బియ్యం మాత్రమే జమ చేశారు. ఇంకా 1,64,370 మెట్రిక్ టన్నుల బియ్యాన్ని ఈ నెలాఖరు లోపు అందజేయాల్సి ఉన్నది.

అలాగే, 2022-23 వానాకాలం సీజన్‌కు సంబంధించి 3,68,278 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని మిల్లులకు కేటాయిం చారు. మిల్లులు వడ్లను మర ఆడించి 2,47,557 మెట్రిక్ టన్నుల బియ్యాన్ని ప్రభుత్వానికి అందించాల్సి ఉన్నది. కానీ పలుమార్లు గడువు పొడించినా ఇప్పటివరకు 2,29,562 మెట్రిక్ టన్నుల బియ్యాన్ని మాత్రమే ప్రభుత్వానికి అందజే శారు. ఇంకా 17,995 మెట్రిక్ టన్నుల బియ్యాన్ని ఇవ్వాల్సి ఉన్నది. జిల్లాలో 160 మిల్లులకుగాను, సీఎంఆర్ బియ్యం పక్కదారి పట్టించినట్లు ఆరోపణలు రావడంతో 6 రైస్‌మిల్లు లపై కేసులు నమోదు చేశారు. 68 మిల్లులను బ్లాక్‌లిస్ట్‌లో పెట్టి ధాన్యం కేటాయింపులను నిలిపి వేశారు.

ఈ నెలాఖరు లోగా జమ చేయాలి

సీఎంఆర్ బియ్యం సేకరణ గడువును ప్రభుత్వం ఈ నెల 29 వరకు పొడిగించింది. జిల్లాలో ఇప్పటికీ లక్ష్యాన్ని చేరుకోని మిల్లర్లు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి. 2022-23 వానాకాలం సీజన్‌కు సంబంధించి 93 శాతం, 2022-23 యాసంగి సీజన్‌కు సంబంధించి 19 శాతం బియ్యాన్ని మాత్రమే జమ చేశారు. గడువు లోపు మిగిలిన సీఎంఆర్ అందజేయకపోతే చర్యలు తీసుకుంటాం.

- హరికృష్ణ, పౌరసరఫరాల శాఖ డీఎం, మెదక్



ఏడుపాయల క్షేత్రంలో భక్తుల రద్దీ

ఏడుపాయల.. జనసంద్రం

మాఘ అమావాస్య సందర్భంగా పుణ్యస్నానాలు చేయడానికి తరలివచ్చిన భక్తులతో ఏడుపాయల వనదుర్గామాత క్షేత్రం జనసంద్రాన్ని తలపించింది. తెల్లవారుజాము నుంచే భక్తులు మంజీరా నది పాయల్లో స్నానమాచరించి, అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు.

7లో



మంజీరా నది ఒడ్డున షవర్ల వద్ద స్నానాలు చేస్తున్న భక్తులు



తమ ప్లాట్లను పెద్దచెరువు కబ్జా చేసిందని ప్రజావాణిలో ఫిర్యాదు చేయడానికి వచ్చిన అమీన్‌పూర్ ప్లాట్ల యజమానులు

మా ప్లాట్లను చెరువు కబ్జా చేసింది

25 లే అవుట్లలో 5వేల ప్లాట్లు మింగేసింది

93 ఎకరాల చెరువు

450 ఎకరాలకు విస్తరణ

న్యాయం చేయాలని ప్రజావాణిలో అమీన్‌పూర్ ప్లాట్ల యజమానుల ఫిర్యాదు

7లో

సదాశివపేట బల్దియాలో నెగ్గిన అవిశ్వాసం

- చైర్‌పర్సన్‌కు వ్యతిరేకంగా 21 మంది కౌన్సిలర్ల ఓటు
- కొత్త చైర్‌పర్సన్ ఎంపికపై ఉత్కంఠ

సదాశివపేట, ఫిబ్రవరి 9: సదాశివపేట బల్దియాలో అవిశ్వాసం నెగ్గింది. మున్సిపల్ చైర్‌పర్సన్‌కు వ్యతిరే కంగా బీఆర్ఎస్ చీలిక వర్గం, కాంగ్రెస్, బీజేపీ, ఎంఐఎం కౌన్సిలర్లు 21 మంది ఓటేశారు. దీంతో మున్సిపల్ చైర్‌పర్సన్ పిల్లోడి జయమ్మ పదవిని కోల్పో యారు. ప్రిసైడింగ్ అధికారిగా వ్యవహరించిన ఆర్డీవో సీహెచ్ రవీందర్‌రెడ్డి ఆధ్వర్యంలో శుక్రవారం మున్సి పల్ సమావేశ మందిరంలో ప్రత్యేక సమావేశం నిర్వ హించారు. మున్సిపాలిటీలోని 26 మంది సభ్యులు ఉండగా 22 మంది ఏకతాటిపై ఉండడంతో చైర్‌పర్సన్ కు పదవీ గండం తప్పలేదు. మున్సిపల్ పీఠం కోల్పోవ డంతో బీఆర్ఎస్ శ్రేణుల్లో నిరాశ అలుముకున్నది. మారిన రాజకీయ సమీకరణాల నేపథ్యంలో కాంగ్రెస్‌కు చెందినవారే తదుపరి చైర్‌పర్సన్‌గా ఎన్ని కయ్యే అవకాశం ఉన్నదని భావిస్తున్నారు. నియోజక వర్గం నుంచి బీఆర్ఎస్‌కు చెందిన చింతా ప్రభాకర్ ఎమ్మెల్యేగా ప్రాతినిధ్యం వహిస్తున్నా.. కాంగ్రెస్‌లో టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ ఎమ్మెల్యే జగ్గా రెడ్డి చురుకైన పాత్ర పోషిస్తుండడంతో బల్దియా రాజకీ యాలు ఆసక్తికరంగా మారాయి.



ప్రత్యేక సమావేశంలో ప్రిసైడింగ్ అధికారి సీహెచ్ రవీందర్‌రెడ్డి

హాజరైన 21 మంది కౌన్సిలర్లు

చైర్‌పర్సన్‌కు వ్యతిరేకంగా నోటీసులు అందజేసిన అనంతరం విహారయాత్రకు వెళ్లిన 21 మంది కౌన్సిలర్ల బృందం శుక్రవారం ప్రత్యేక వాహనాల్లో నేరుగా మున్సి పల్ కార్యాలయానికి చేరుకున్నారు. వైస్ చైర్మన్ చింతా గోపాల్, కౌన్సిలర్లు ఇంద్రమోహన్‌గౌడ్, నాగరాజుగౌడ్, గుండురవి, విద్యాసాగర్‌రెడ్డి, శ్రీనివాస్, ఇలియాజ్‌ష రీఫ్, ఖుద్దుస్ ఖురేషీ, చౌదరి ప్రకాష్, ఆకుల శివకు మార్, వడ్ల మహేశ్వరి, సాతాని లలిత, కోవూరి లక్ష్మీప్ర సన్న, ఓదెల రాజేశ్వరి, పిచరాగడి రేణుక, నల్ల శివలక్ష్మీ, రేష్మాబేగం, నస్రీ న్ బేగం, రజియాబేగం, షహజాదాబీ బేగం, ముంతాజ్‌బేగం ఉదయం 10:30కు కౌన్సిల్ సమా వేశ మందిరానికి చేరుకు న్నారు. కోరం సరిపడా హాజరు ఉండడంతో ఎన్ని కల అధికారిగా వ్యవహ రించిన ఆర్డీవో నియమా వళి మేరకు ఫొటో, వీడియో చిత్రీకరణ ద్వారా 21 మంది కౌన్సిలర్ల సంత కాలు సేకరించారు. అనంతరం చైర్‌పర్సన్ పిల్లోడి జయమ్మపై ప్రతిపాదించిన అవిశ్వాస తీర్మానానికి అనుకూలంగా, వ్యతిరేకంగా ఓటింగ్ నిర్వహించారు. అవిశ్వాస తీర్మానానికి అనుకూలంగా మొత్తం 21 మంది కౌన్సిలర్లు చేతులు పైకెత్తడంతో, అవిశ్వాస తీర్మానం నెగ్గిందని ధ్రువీకరించారు. కొత్త చైర్‌పర్సన్ ఎన్నికకు తేదీ ప్రకటిస్తామని తెలిపారు. సమావేశంలో మున్సిపల్ కమిషనర్ జి.శ్రీనివాస్‌రెడ్డి, తహసీల్దార్ కె.సర స్వతి, ఆర్ఐ.గణేష్ పాల్గొన్నారు.

పీఆర్టీయూతోనే ఉపాధ్యాయ సమస్యల పరిష్కారం



పీఆర్టీయూ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా జెండాను ఎగురవేస్తున్న నాయకులు

గజ్వేల్, ఫిబ్రవరి 9: పీఆర్టీయూతోనే ఉపాధ్యాయ సమస్యల పరిష్కారం సాధ్యమవుతుందని పీఆర్టీయూ పత్రికా సంపాదకవర్గ సభ్యుడు ఊడెం జయపాల్‌రెడ్డి, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు రామకృష్ణారెడ్డి, మండల అధ్యక్షుడు ఊడెం వేమారెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం పీఆర్టీయూ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా మండలాధ్యక్షుడు వేమారెడ్డి గజ్వేల్ పట్టణంలో పీఆర్టీయూ జెండాను ఎగురవేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పీఆర్టీయూ సంఘం ఉపాధ్యాయులకు సంబంధించిన ఎన్నో సమస్యల పరిష్కారానికి కృషి చేసిందన్నారు. ఉపాధ్యాయుల ప్రధాన సమస్యలైన సీపీఎస్ రద్దు, బదిలీలు, పదోన్నతుల ప్రక్రియ కొనసాగించడం, పెండింగ్‌లో ఉన్న బిల్లులను మంజూరు, పీఆర్‌సీని సాధిస్తామని, జీవో 317 ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషిచేస్తుందని స్పష్టం చేశారు. వారితో పీఆర్టీయూ మండల ప్రధాన కార్యదర్శి తిగుళ్ల లింగంగౌడ్, నాయకులు బాల్‌చరణ్, శ్రీనివాస్, పోచయ్య, సత్యనారాయణరెడ్డి, యాదగిరి, భూపతిరెడ్డి, గురూజీ తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్య పనులు పకడ్బందీగా చేపట్టాలి



కుకునూరుపల్లిలో గ్రామస్థులతో మాట్లాడుతున్న కౌసల్యాదేవి

కొండపాక, ఫిబ్రవరి 9 : గ్రామాల్లో పారిశుధ్యం పనులు పకడ్బందీగా చేపట్టాలని నియోజకవర్గ ప్రత్యేక అధికారి డీఆర్డీఏ అడిషనల్ ప్రాజెక్ట్ డైరెక్టర్ కౌసల్యాదేవి పేర్కొన్నారు. ప్రభుత్వం చేపట్టిన స్పెషల్ శానిటైజేషన్ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం కుకునూరుపల్లి గ్రామాన్ని ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె గ్రామంలో పర్యటించి పారిశుధ్యం, సీసీరోడ్లు డ్రైనేజీలను పరిశీలించారు. ఓపెన్ ప్లాట్లలో ఉన్న పిచ్చి మొక్కలను కచ్చితంగా తొలగించి గడువు లోగా స్పెషల్ శానిటైజేషన్ కార్యక్రమాన్ని పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి నాగేందర్ పంచాయతీ కార్యదర్శి తిరుపతి, కారోబార్ శ్రీధర్, ఆశా వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.







ఏడుపాయల రాజగోపురం వద్ద కిటకిటలాడుతున్న భక్తులు, వనదుర్గామాతకు బోనం తీసుకెళ్తున్న భక్తురాలు, చిట్కుల్ ఛాముండేశ్వరీమాత ఆలయం సమీపంలోని మంజీరా నదిలో పుణ్య స్నానాలు ఆచరిస్తున్న భక్తులు

మాఘ అమావాస్యను పురస్కరించుకుని శుక్రవారం ఉమ్మడి జిల్లాలో పలుచోట్ల జాతరలు జరిగాయి. మాఘస్నానాలను ఆచరించిన భక్తులు దైవదర్శనం చేసుకుని మొక్కులు చెల్లించుకున్నారు. పిల్లాజల్లను, పాడి పంటలను చల్లగా చూడమని వేడుకున్నారు. మాఘ అమావాస్య సందర్భంగా ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి.

భక్తజన జాతర

మాఘ అమావాస్య ఉత్సవాలతో ఆధ్యాత్మిక శోభ

● పుణ్యస్నానాలు ఆచరించిన భక్తులు ● ఏడుపాయలలో జనసంద్రం

పాపన్నపేట, ఫిబ్రవరి 9: మాఘ ఉత్సవాలకు భారీ సంఖ్యలో భక్తులు తరలిరావడంతో ఏడుపాయల వనదుర్గా మాత ఆలయ ప్రాంగణం జనారణ్యమైంది. శుక్రవారం మాఘ అమావాస్యను పురస్కరించుకుని మంజీరా నదిలో భక్తులు పుణ్య స్నానాలు ఆచరించి, అమ్మవారిని దర్శించుకునేందుకు రాష్ట్రం నుంచే కాకుండా ఇతర రాష్ట్రాల నుంచి భక్తులు తరలిరావడంతో ఆలయ ప్రాంతమంతా కిక్కిరిసిపోయింది. పుణ్య స్నానాలనాంతరం అమ్మవారి దర్శనం కోసం ఆలయం వద్ద గంటల తరబడి బారులు తీరారు. జల్లు స్నానాల వద స్నానాల కోసం భక్తులు పోటీపడ్డారు. అమ్మవారిని దర్శించుకుని భక్తులు మొక్కులు చెల్లించుకున్నారు.

చేతులెత్తేసిన పోలీసులు

భక్తుల రద్దీకి అనుగుణంగా ఏర్పాట్లను కల్పించడంలో దేవాదాయ శాఖ పాలక మండలి పూర్తిగా విఫలమైంది. దీనికి తోడు పోలీసులు చేతులు ఎత్తేయడంతో భక్తులు అవస్థలుపడ్డారు. బందోబస్తు ఏర్పాట్లు చేయడంతో ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తడంతో ఆ ప్రాంతంలో ఎక్కడి వాహనాలు అక్కడే నిలిచిపోయాయి. ట్రాఫిక్ నియంత్రణ చర్యలు చేపట్టేందుకు సిబ్బంది కనీస చర్యలు తీసుకోలేదు. ఏడుపాయల జాతరలోనే మెదక్ డీఎస్పీ ఉండి బందోబస్తును పర్యవేక్షించినప్పటికీ ఫలితం లేకపోయింది. తగినంత సిబ్బందిని జాతరకు కేటాయించకపోవడంతో భక్తులకు సమస్యలు తలెత్తాయి. బీఆర్ఎస్ నాయకులు హిప్కో డైరెక్టర్ దేవేందర్‌రెడ్డి అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా జాతర ఏర్పాట్లను ఏడుపాయల చైర్మన్ బాలాగౌడ్, ఏడుపాయల ఈవో మోహన్‌రెడ్డి, డైరెక్టర్లు, ఆలయ సిబ్బంది, జాతర ఏర్పాట్లను పర్యవేక్షించారు.

శివరాత్రి ఉత్సవాలకు సీఎం రేవంత్‌రెడ్డి

మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా ఏడుపాయల వనదుర్గామాత సన్నిధిలో జరిగే మహాజాతరకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రానున్నట్లు మెదక్ మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ పార్టీ నాయకులు మైనంపల్లి హన్మంత్‌రావు పేర్కొన్నారు. శుక్రవారం మాఘ అమావాస్య ఉత్సవాల్లో భాగంగా సాయంత్రం అమ్మవారిని సతీసమేతంగా దర్శించుకున్న ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడారు. ఇటీవలనే ఏడుపాయల జాతర నిర్వాహణ, ఆలయ చరిత్రను ముఖ్యమంత్రికి తెలియజేసి, తాను, తన కుమారుడు మైనంపల్లి రోహిత్ ముఖ్యమంత్రికి తెలియజేసి మహాశివరాత్రి ఉత్సవాల్లో పాల్గొనాలని ముఖ్యమంత్రిని కోరామన్నారు. అందుకు ఆయన సానుకూలంగా స్పందించారని పేర్కొన్నారు.

కొప్పోల్‌లో కిటకిట

పెద్దశంకరంపేట, ఫిబ్రవరి 9: పెద్దశంకరంపేట మండల పరిధిలోని కొప్పోల్ ఉమాసంగమేశ్వర స్వామి దేవాలయం శుక్రవారం భక్తులగతో కిటకిటలాడింది. ఆలయ సమీపంలోని కోనేటిలో వేకువ జాము నుంచి భక్తులు పవిత్ర స్నానాలు ఆచరించిస్వామివారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ పూజారి సంగప్ప ప్రత్యేక పూజలు చేశారు.

చిట్కుల్ మంజీరా ఒడ్డున పుణ్యస్నానాలు

చిలప్‌చెడ్, ఫిబ్రవరి 9: చిట్కుల్ చాముండేశ్వరి ఆలయ సమీపంలో గల మంజీరా నదిలో భక్తులు శుక్రవారం మాఘ స్నానాలు ఆచరించారు. అనంతరం అమ్మవారిని దర్శించుకున్నారు. తూప్రాన్ డీఎస్పీ యాదగిరి రెడ్డి ఆలయం వద్ద బందోబస్తును పర్యవేక్షించారు.

పులకించిన పుల్లూరు



పుల్లూరు బండపై గుండంలో స్నానాలు

సిద్దిపేటరూరల్, ఫిబ్రవరి 9: సిద్దిపేట రూరల్ మండలంలోని పుల్లూరు బండపై గల స్వయభూ లక్ష్మీనృసింహ స్వామి క్షేత్రంలో జాతరను పురస్కరించుకుని శుక్రవారం ఉత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. మాఘమ అమావాస్య సందర్భంగా బండపైన గల గుండంలో భక్తులు పవిత్ర స్నానాలు ఆచరించి శ్రీలక్ష్మీనృసింహస్వామివారిని దర్శించుకున్నారు. స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో పుల్లూరు బండ జాతరలో తడి, పొడి చెత్త వేసేందుకు డ్రమ్ముల ఏర్పాటు, ప్లాస్టిక్‌ను నివారించేందుకు సాహసనీ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో స్టాల్ ఏర్పాటు చేసి భక్తులకు అవగాహన కల్పించారు.

రామలింగేశ్వరాలయం భక్తిపారవశ్యం

దుబ్బాక, ఫిబ్రవరి 9: అక్బర్‌పేట- భూంపల్లి మండలం రామేశ్వరంపల్లి రామలింగేశ్వరాలయం జాతర శుక్రవారం భక్తజనసంద్రంగా మారింది. మాండవ్యనదిగా పిలువబడే కూడవెల్లి వాగులో మాఘస్నానాలకు భక్తులు భారీగా తరలివచ్చారు. శుక్రవారం జిల్లాతో పాటు వివిధ జిల్లాల నుంచి ఆలయ దర్శనం కోసం సుమారు 60వేల మందికి పైగా భక్తులు తరలివచ్చినట్టు ఆలయ కమిటీ తెలిపింది. ఆలయంలో రామలింగేశ్వరుడి దర్శనం కోసం సుమారు మూడు కిలోమీటర్ల పొడువునా క్యూలైన్‌లో నిలబడ్డారు. ఆలయానికి వచ్చే వాహనాలను సుమారు రెండు కిలోమీటర్ల దూరంలోనే నిలిపివేశారు. దుబ్బాక, మెదక్, సిద్దిపేట, కామారెడ్డి బస్‌డిపోల నుంచి ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేసి, ప్రత్యేక రూట్లలో నడిపారు. దుబ్బాక సీఐ శ్రీనివాస్ ఆధ్వర్యంలో దుబ్బాక, మిరుదొడ్డి, భూంపల్లి ఎస్ఐలు ప్రత్యేక బందోబస్తు ఏర్పాటు చేశారు. తిమ్మాపూర్, రామక్కపేట, భూంపల్లి పీహెచ్‌సీల సిబ్బంది ఆధ్వర్యంలో ప్రత్యేక వైద్యశిబిరాన్ని నిర్వహించారు.

ప్రకృతి కోవెల సింగరాయ క్షేత్రానికి పోటెత్తిన భక్తులు

కోహెడ, ఫిబ్రవరి 9: ఉత్తర తెలంగాణలోనే ప్రసిద్ధిగాంచిన సింగరాయ జాతరకు శుక్రవారం భక్తులు పోటెత్తారు. ప్రతి ఏటా పుష్య బహుళ (మాఘ) అమావాస్య రోజున ఈ జాతర జరుగుతుంది. సిద్దిపేట జిల్లా కోహెడ మండలం కూరెల్ల, తంగళ్లపల్లి, గుండారెడ్డిపల్లి, బస్వాపూర్ గ్రామాల శివార్లలో మోయతుమ్మెద వాగు ఒడ్డున ప్రతాప సింగరాయుడిగా వెలసిన లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో జాతర వైభవంగా జరిగింది. ఉమ్మడి మెదక్, కరీంనగర్, వరంగల్ జిల్లాలతో పాటు మహారాష్ట్ర నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు వచ్చి మొక్కులు చెల్లించుకున్నారు. తెల్లవారుజాము నుంచి భక్తులు పడమరవాహినిగా పారే మోయతుమ్మెద వాగులో మాఘస్నానాలను ఆచరించారు. అనంతరం వాగు పక్కన చెలమను తోడి అందులో నుంచి తీసిన నీటితో వంకాయ కూర, చింతపండుచారు చేసుకుని అక్కడే సహపంక్తి భోజనాలు చేశారు. మరికొందరు వంకాయ, చిక్కుడు, టమాటాలను కలిపి కూర చేసుకోవడం గమనార్హం. జాతర కోసం ప్రభుత్వం పూర్తిస్థాయిలో ఏర్పాట్లు చేయకపోవడంతో భక్తులు ఇబ్బంది పడ్డారు. కోహెడ ఎంపీపీ కొక్కులకీర్తి సురేష్, కోహెడ మార్కెట్ కమిటీ అధ్యక్షురాలు తిప్పారపు జ్యోతి శ్రీకాంత్ లు దర్శించుకున్నారు. ఈ జాతరలో మీనాక్షి షాపింగ్ మాల్ సుకుమార్‌రావు ఆధ్వర్యంలో భక్తులకు 15 వేల చల్లని వాటర్, మజ్జిగ ప్యాకెట్లను ఉచితంగా పంపిణీ చేశారు. దాహం తీర్చినందుకు భక్తులు హర్షం వ్యక్తం చేశారు.

గుబ్బడి గుట్టపై దత్తాత్రేయుడికి నీరాజనం

నంగునూరు, ఫిబ్రవరి 9 : గుబ్బడి గుట్ట భక్తులతో శుక్రవారం కిటకిటలు ఆడింది. మండలంలోని పాలమాకుల శివారులోని విశాలమైన బండపై వెలసిన దత్తాత్రేయ స్వామి ఆలయానికి ఒక ప్రత్యేక ఉంది. మాఘ అమావాస్య సందర్భంగా ఒక్కరోజు మాత్రమే ఆలయం తెరిచి అదే రోజు సాయంత్రం మూసివేయడం ఆనవాయితీ. చీకోటి వంశస్థులు దత్తాత్రేయస్వామి వారికి ప్రత్యేక పూజలు చేసి జాతర నిర్వహించారు.









కొప్పోల్ ఉమాసంగమేశ్వర, ఝరాసంగం కేతకీ ఆలయాల్లోని కోనేటిలో స్నానాలు ఆచరిస్తున్న భక్తులు, కోహెడ మండలంలోని సింగరాయ గుట్టపై, రామేశ్వరంపల్లి రామలింగేశ్వరస్వామి జాతరలో భక్తుల సందడి

పూరిగుడిసె దగ్ధం.. రూ.8.50 లక్షల నష్టం



దగ్ధమైన గుడిసె వద్ద విచారణ జరుపుతున్న రెవెన్యూ ఇన్‌స్పెక్టర్

తూప్రాన్, ఫిబ్రవరి 9: పూరిగెడెసె దగ్ధమై సుమారు రూ. 8.50 లక్షల ఆస్తి నష్టం వాటిల్లింది. ఈ సంఘటన తూప్రాన్ పట్టణంలోని మండల కార్యాలయాల సమీపంలో శుక్రవారం చోటుచేసుకున్నది. బాధితులు, రెవెన్యూ అధికారుల కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. తూప్రాన్ పట్టణంలోని మండల కార్యాలయాలకు సమీపంలో కండెల నర్సింహులు, గంగోత్రి దంపతులు గుడిసెను ఏర్పాటు చేసుకుని జీవిస్తున్నారు. శుక్రవారం ఉదయం నర్సింహులు బయటకు వెళ్లిపోగా, భార్య గంగోత్రి ఇంట్లో పూజలు చేసి దీపం వెలిగించి, సమీపంలో తెలిసిన వాళ్ల ఇంటికి వెళ్లింది. ఆ సమయంలో అగ్ని ప్రమాదం సంభవించి గుడిసె పూర్తిగా దగ్ధమైంది. గుడిసెలో ఉన్న రూ.3లక్షల నగదు, నాలుగు తులాల బంగారు అభరణాలు, బియ్యం, ఇతర సామగ్రి, వంటపాత్రలు, దుస్తులు కాలి బూడిదయ్యాయి. విషయం తెలియగానే రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ నాగరాజు సిబ్బందితో అక్కడకు చేరుకుని పరిశీలించారు. సుమారు రూ.8.50 లక్షల నష్టం వాటిల్లినట్లు నాగరాజు తెలిపారు. తక్షణ సహాయంగా బియ్యం అందజేస్తున్నట్లు నాగరాజు వివరించారు.

మంజీరా నదిలో గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యం

రాయికోడ్, ఫిబ్రవరి 9: సంగారెడ్డి జిల్లా రాయికోడ్ మండల పరిధిలోని దౌల్తాబాద్ గ్రామ శివారులోని మంజీరా నది బ్యాక్ వాటర్‌లో శుక్రవారం గుర్తుతెలియని వ్యక్తి మృతదేహాన్ని గుర్తించారు. ఎస్ఐ వెంకట్‌రెడ్డి కథనం ప్రకారం.. దౌల్తాబాద్ గ్రామ శివారులో మంజీరా బ్యాంక్ వాటర్‌లో గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం కనిపించడంతో స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. అక్కడికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని నదిలో నుంచి బయటకు తీశారు. మృతుడి వయసు సుమారు 40 నుంచి 45 సంవత్సరాల ఉంటుందని నిర్ధారించారు. మృతుడి వద్ద ఎలాంటి ఆధారాలు లభించలేదు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని మృతదేహాన్ని జహీరాబాద్ ప్రభుత్వ ఆసుపత్రి మార్చురీలో భద్రపరిచామని ఆయన పేర్కొన్నారు.

టీపీటీఎఫ్ మహాసభలకు తరలిరావాలి

● రాష్ట్ర కౌన్సిలర్ రాజారెడ్డి

గుమ్మడిదల ఫిబ్రవరి 9 : ఈ నెల 11, 12 తేదీల్లో ఖమ్మంలో జరిగే టీపీటీఎఫ్ రాష్ట్ర మహాసభలకు పెద్ద సంఖ్యలో ఉపాధ్యాయులు హాజరై మహాసభలు విజయవంతం చేయాలని టీపీటీఎఫ్ రాష్ట్ర కౌన్సిలర్ కే.రాజారెడ్డి పిలుపునిచ్చారు. శుక్రవారం మండలంలోని అన్నారం ఉన్నత పాఠశాలలో టీపీటీఎఫ్ గుమ్మడిదల మండల ప్రధాన కార్యదర్శి ఎల్.సమ్యానాయక్‌తో కలిసి మహాసభల పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రాష్ట్ర కౌన్సిలర్ కే.రాజారెడ్డి మాట్లాడుతూ... టీపీటీఎఫ్ ఉపాధ్యాయుల సమస్యలు మాత్రమే కాకుండా సమాజంలో ఉన్న అనేక రుగ్మతల పట్ల అవగాహన కలిగి ఉండాలన్నారు.

దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలి

● వ్యవసాయ కార్మిక సంఘం

సంగారెడ్డి రూరల్, ఫిబ్రవరి 9 : కేంద్ర ప్రభుత్వం అవలంభిస్తున్న కార్మిక, కర్షక, ప్రజావ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఈ నెల 16న దేశవ్యాప్త సమ్మె, గ్రామీణ బందు నిర్వహిస్తున్నామని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి నర్సింలు తెలిపారు. సమ్మెను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ మేరకు సంగారెడ్డి మండలం ఫసల్‌వాది గ్రామంలో శుక్రవారం ఉపాధి హామీ కూలీలతో కలిసి గ్రామీణ బందుకు సంబంధించి కరపత్రం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంతాల్లో పేదల కోసం గ్రామీణ ఉపాధి చట్టాన్ని తెస్తే, మోదీ ప్రభుత్వం చట్టాన్ని నిర్వీర్యం చేస్తున్నదన్నారు. కూలీలకు ఉపాధి లేకుండా నిధులు తగ్గించి వ్యవసాయ కూలీల పొట్టగొడుతున్నదని విమర్శించారు. ధరలు విపరీతంగా పెంచి ప్రజల నడ్డీ విరిచిందని ఆరరోపించారు. ఈ నెల 16న దేశవ్యాప్తంగా పారిశ్రామిక ప్రాంత కార్మికులు, అన్ని వర్గాల ప్రజలు సమ్మె, గ్రామీణ బందులో పాల్గొని కేంద్ర ప్రభుత్వానికి తగిన బుద్ధి చెప్పాలని కోరారు.

మా ప్లాట్‌లను చెరువు కబ్జా చేసింది

● 25 లే అవుట్లలో 5వేల ప్లాట్లు మింగేసింది
● 93 ఎకరాల చెరువు... 450 ఎకరాలకు విస్తరణ
● న్యాయం చేయాలని ప్రజావాణిలో అమీన్‌పూర్ పెద్ద చెరువు ప్లాట్ల బాధిత యజమానుల ఫిర్యాదు

బేగంపేట, ఫిబ్రవరి 9: తమ ప్లాట్‌లను ఓ చెరువు కబ్జా చేసిందని, తమకు న్యాయం చేయాలంటూ ప్లాట్ల యజమానులు హైదరాబాద్‌లో శుక్రవారం జరిగిన ప్రజావాణిలో వేడుకున్నారు. సంగారెడ్డి జిల్లా అమీన్‌పూర్ గ్రామంలో ఉన్న పెద్ద చెరువు గత 5 సంవత్సరాల నుంచి ప్లాట్లను కబ్జా చేసిందని, దీని నుంచి ప్లాట్లను రక్షించాలని సదరు బాధితులు బ్యానర్లతో ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. చెరువుకు దిగువన ఉన్న రెండు తూముల నుంచి నీరు వెళ్లకుండా మూసివేయడంతో ఎగువ నుంచి వచ్చే పారిశ్రామిక వ్యర్థాలు, మురుగునీరు, వర్షం నీరు నిలిచి, చెరువు విస్తీర్ణం 93 ఎకరాల నుంచి 450 ఎకరాలకు విస్తరించిందని పేర్కొన్నారు. అమీన్‌పూర్ పెద్ద చెరువుకు సమీపంలో సుమారు 30 సంవత్సరాల క్రితం 25 లే అవుట్‌లలో వేసిన 5వేల ప్లాట్లను పలువురు కొనుగోలు చేశారు. గ్రామ పంచాయతీ, హెచ్ఎండీఏ అనుమతులు ఉన్నాయని, ఎల్ఆర్‌సైతం ఉన్నా.. గత 5 సంవత్సరాలుగా ప్లాట్లు చెరువులో కలిసి పోయయాని ఫిర్యాదులో పేర్కొన్నారు. చెరువు నీరు కిందకు వెళ్లడానికి ఉన్న రెండు తూములను 5 సంవత్సరాల క్రితం మూసివేయడం వల్లనే సమస్య ఏర్పడిందన్నారు. ఎగువ నుంచి వస్తున్న పారిశ్రామిక వ్యర్థాలు, మురుగునీరు, వర్షం నీరు కారణంగా ఒకప్పుడు 93 ఎకరాల విస్తీర్ణం ఉన్న చెరువు ప్రస్తుతం 450 ఎకరాలకు విస్తరించిందని తెలిపారు. దీని వల్ల గతంలో తాము కొనుగోలు చేసిన వేలాది ప్లాట్లు చెరువులో కలిసిపోయాయిని వాపోయారు. చెరువుకు దిగువన నీరు వెళ్లే రెండు తూములను తెరవాలని ప్లాట్ల యజమానులు ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. చెరువుకు దిగువన లేఅవుట్లు వేసిన బడా నేతల ఒత్తిడితోనే అధికారులు చెరువు తూములను మూసివేశారని ప్రజావాణికి ఇచ్చిన ఫిర్యాదులో వారు పేర్కొన్నారు.

డంపింగ్‌యార్డ్ అనుమతులు రద్దు చేయండి

● ప్రిన్సిపల్ చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్టు అధికారికి వినతి



మోహన్ చంద్ర పర్గేయన్‌కు వినతిపత్రం సమర్పిస్తున్న జడ్పీటీసీ కుమార్ గౌడ్, నాయకులు

గుమ్మడిదల, ఫిబ్రవరి 9: హైదరాబాదు మహానగరంలో సేకరించిన చెత్తను వేసేందుకు గుమ్మడిదల మండలం ప్యారా నగర్ శివారులో డంపింగ్ యార్డు ఏర్పాటు కోసం ఇచ్చిన అనుమతులు రద్దు చేయాలని గుమ్మడిదల మండల ప్రజాప్రతినిధులు కోరారు. ఈ మేరకు శుక్రవారం తెలంగాణ ప్రిన్సిపల్ చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్టు అధికారి మోహన్ చంద్ర పర్గేయన్‌కు జడ్పీటీసీ కుమార్ గౌడ్, బీఆర్ఎస్ నాయకులు సద్ది విజయభాస్కర్‌రెడ్డి, ఎంపీటీసీ కొత్తపల్లి ప్రభాకర్‌రెడ్డి, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు ఎండీ హుస్సేన్ వినతిపత్రాన్ని అందించి విన్నవించారు. రెండు రోజులుగా గుమ్మడిదల మండలంలోని ప్యారానగర్ శివారులో డంపింగ్‌యార్డ్ నిర్మాణ పనులు ప్రారంభించిన నేపథ్యంలో ఈ ప్రాంత ప్రజలు ఇక్కడ ఏర్పాటు చేయవద్దంటూ ఆందోళన నిర్వహిస్తున్న సంగతి తెలిసిందే. ప్యారా నగర్‌లో డంపింగ్‌యార్డ్ ఏర్పాటు చేయడం వల్ల కలిగే నష్టాలు, ఫారెస్టు పర్యావరణానికి జరిగే ముప్పు, ప్రజల జీవన విధానంపై పడే ప్రభావాన్ని వినతిపత్రం ద్వారా వివరించారు. ప్యారా నగర్‌లో డంపింగ్‌యార్డ్ నిర్మాణం రద్దు చేయాలని కోరుతూ ప్రజాప్రతినిధులు ఇప్పటికే మండలంలోని 13 గ్రామ పంచాయతీల ఏకగ్రీవంగా చేసిన తీర్మాన కాపీలు, మండల పరిషత్ సర్వసభ్య సమావేశంలో చేసిన తీర్మాన కాపీలను వినతిపత్రంతో జత చేసి ఫారెస్టు అధికారికి అందజేశారు. ప్రజల అభిప్రాయాలను ప్రభుత్వం దృష్టికి తీసుకుపోయి చర్చించి ప్రజలకు మేలు జరిగే విధంగా నిర్ణయం తీసుకుంటామని అధికారి హామీ ఇచ్చినట్టు తెలిపారు.

రాష్ట్ర స్థాయి సైన్స్ పోటీలకు 12 మంది విద్యార్థులు



ఎంపికైన విద్యార్థులతో డీఈవో వెంకటేశ్వరు

సంగారెడ్డి అర్బన్, ఫిబ్రవరి 9 : సంగారెడ్డిలోని జిల్లా సైన్స్ కేంద్రంలో జాతీయ స్థాయి సైన్స్ దినోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం వివిధ పోటీలు నిర్వహించారు. పెయింటింగ్, కవిత్వం, పాటలు, ఉపన్యాస పోటీలు నిర్వహించి వాటిలో జిల్లా స్థాయి నుంచి ఒక్కొక్క విభాగంలో ముగ్గురు చొప్పున 12 మంది విద్యార్థులను రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక చేశారు. ఈ నెల 28న రాష్ట్రస్థాయిలో రవీంద్రభారతిలో జరిగే కార్యక్రమంలో 12 మంది ప్రశంసాపత్రాలు, జ్ఞాపికలు అందుకోనున్నారు. ఎంపికైన విద్యార్థులను డీఈవో వెంకటేశ్వర్లు అభినందించారు. కార్యక్రమంలో డీసీఈబీ సెక్రటరీ లింబాజీ, జిల్లా సైన్స్ అధికారి సిద్ధారెడ్డి, పూర్ణకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

కూడవెల్లి వాగులో వ్యక్తి గల్లంతు

మిరుదొడ్డి, ఫిబ్రవరి 9: మాఘ అమవాస్య స్నానం అచరించడానికి వాగులో దిగిన వ్యక్తి గల్లంతయ్యాడు. ఈ సంఘటన మిరుదొడ్డి మండలం అల్వాల్ గ్రామంలో శుక్రవారం చోటుచేసుకున్నది. మిరుదొడ్డి గ్రామానికి చెందిన మద్దెల స్వామి(41) గ్రామశివారులోని కూడవెల్లి వాగులో మాఘ అమవాస్య స్నానం చేస్తుండగా ప్రమాదవశాత్తు గల్లంతయ్యాడు. స్వామిని స్థానికులు కాపాడే ప్రయత్నం చేసినా ఫలితం లేకుండాపోయింది. అక్కడి చేరుకున్న పోలీసులు గజ ఈతగాళ్ల సహాయంతో గాలింపు చర్యలు చేపట్టిన మృతదేహం లభించలేదు. కుటుంబసభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసుకుని దర్యాప్తును చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు. మృతుడికి భార్య ఇద్దరు పిల్లలున్నారు.

పరిశ్రమలో ప్రమాదవశాత్తు కార్మికుడి మృతి



కిషోర్ (ఫైల్)

మనోహరాబాద్, ఫిబ్రవరి 9: పరిశ్రమలో పని చేస్తుండగా ప్రమాదవశాత్తు కిందపడి కార్మికుడు మృతిచెందాడు. ఈ సంఘటన మనోహరాబాద్ మండల కేంద్రంలోని కాళ్లకల్ పరిధిలో శుక్రవారం చోటుచేసుకున్నది. ఎస్ఐ కరుణాకర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం మనోహరాబాద్ మండలం కాళ్లకల్ శివారలోని లీవేన్‌టెక్ బోర్డ్ పరుపుల తయారీ పరిశ్రమలో కిషోర్(18) అనే కార్మికుడు పనిచేస్తున్నాడు. అతను రాజస్థాన్ రాష్టానికి నుంచి 22 నెలల క్రితం ఇక్కడకు వచ్చి, కాళ్లకల్‌లో నివాసముంటూ పరిశ్రమలో పని చేస్తున్నాడు. శుక్రవారం రబ్బర్ ఫామ్ అయ్యే గదిలో పని చేస్తుండగా కాలుజారి కింద పడడంతో పరిశ్రమ యాజమాన్యం మేడ్చల్‌లోని ఓ ప్రైవేట్ హాస్పటల్‌కు తరలించింది. పరిశీలించిన డాక్టర్లు అప్పటికే అతను మృతిచెందాడని నిర్ధారించారు. సంఘటన స్థలానికి చేరుకునిపోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

ప్రేమించిన యువకుడికి వివాహం జరిగిందని విద్యార్థిని ఆత్మహత్య



తరుణి (ఫైల్)

మాసాయిపేట, ఫిబ్రవరి 9: ప్రేమించిన యువకుడికి మరో యువతితో వివాహం కావడంతో మనస్తాపంతో ఇంటర్ విద్యార్థిని ఆత్మహత్య చేసుకున్నది. బంధువులు, గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం.. మాసాయిపేట మండలం పోతనపల్లి గ్రామానికి చెందిన ఎర్ర తరుణి(17) హైదరాబాద్‌లో ఇంటర్ చదువుతున్నది. రెండు సంవత్సరాల పాటు అదే గ్రామానికి చెందిన యువకుడితో ప్రేమాయాణం సాగింది. యువకుడికి గతేడాది మరో యువతితో పెళ్లి కావడంతో మనోవేదకు గురైన తరుణి గురువారం రాత్రి హైదరాబాద్‌లోని తమ బంధువుల ఇంట్లో ఉరేసుకుని మృతి చెందింది. తరుణి స్వగ్రామమైన పోతనపల్లిలో శుక్రవారం అంత్యక్రియలు నిర్వహించారు.

గీతం యూనివర్సిటీని సందర్శించిన కలెక్టర్

పటాన్‌చెరు రూరల్, ఫిబ్రవరి 9: రానున్న పార్లమెంట్ ఎన్నికల సన్నద్ధతలో భాగంగా జహీరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం (7) సెగ్మెంట్లకు అవసరమైన స్ట్రాంగ్ రూమ్‌లు, కౌంటింగ్ హాళ్ల ఏర్పాటు కోసం శుక్రవారం రుద్రారం గీతం డీమ్డ్ యూనివర్సిటీని జిల్లా కలెక్టర్ వల్లూరు క్రాంతి సందర్శించారు. ఆయా గదులు, హాళ్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె అధికారులకు పలుసూచనలు చేశారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు చంద్రశేఖర్, మాధురి, డీఎస్పీ, డిప్యూటీ కలెక్టర్ మహిపాల్‌రెడ్డి, తహసీల్దార్ భాస్కర్, ఆర్ అండ్‌బీ అధికారులు, రుద్రారం సర్పంచ్ సుధీర్ రెడ్డి, గీతం యూనివర్సిటీ ప్రతినిధులు పాల్గొన్నారు.

దురుసుగా ప్రవర్తించిన ఉపాధ్యాయుల సస్పెన్షన్

పటాన్‌చెరు, ఫిబ్రవరి 9: పాఠశాలలోని విద్యార్థులు, వారి తల్లిదండ్రుల పట్ల అమర్యాదగా వ్యవహరిస్తూ, విధి నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న ఇద్దరు ప్రభుత్వ ఉపాధ్యాయులను జిల్లా విద్యాధికారి వెంకటేశ్వర్లు సస్పెండ్ చేస్తూ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. పటాన్‌చెరు ఎంఈవో పీపీ.రాథోడ్ తెలిపిన వివరాల ప్రకారం.. పటాన్‌చెరు మండలం ముత్తంగి జిల్లా పరిషత్తు ప్రాథమిక పాఠశాలలో విధులు నిర్వహిస్తున్న డీ.సందీప్‌రెడ్డి, ఎస్.నర్సింలు విద్యార్థులను అకారణంగా దండిస్తున్నారు. ఈ విషయమై నిలదీసిన విద్యార్థుల తల్లిదండ్రుల పట్ల అమర్యాదగా వ్యవహరించారు. ఈ విషయమై జిల్లా విద్యాధికారికి ఫిర్యాదులు అందాయి. విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులను విచారించగా ఉపాధ్యాయులు విధి నిర్వహణలో బాధ్యతారాహిత్యంగా వ్యవహరిస్తున్నట్లు తేలింది. ఉపాధ్యాయులపై వచ్చిన అభియోగాలను పరిశీలించిన తరువాత వారిని విధుల నుంచి సస్పెండ్ చేస్తూ శుక్రవారం జిల్లా విద్యాధికారి వెంకటేశ్వర్లు ఆదేశాలు జారీ చేశారు.

'చక్రియాల అభివృద్ధికి నిధులివ్వండి'

పుల్‌కల్, ఫిబ్రవరి 9: చౌటకూర్ మండలం చక్రియాల గ్రామాభివృద్ధికి నిధులు కేటాయించాలని ఆ గ్రామ కాంగ్రెస్ నాయకులు మంత్రి దామోదర రాజనర్సింహను కోరారు. సంగారెడ్డిలోని ఆయన నివాసానికి పలువురు నాయకులు శుక్రవారం వెళ్లి విన్నవించారు. గ్రామంలోని అనంతపద్మనాభస్వామి ఆలయానికి వెళ్లే రహదారిని సిమెంటు రోడ్డుగా మార్చాలని కోరారు. గ్రామంలోని పలు వీధుల్లో మురుగు కాలువలు, సీసీరోడ్లు, హైమాస్ లైట్లు తదితర అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేయాలని కోరారు. అనంతపద్మనాభ స్వామి ఆలయ పాలకవర్గ పదవీ కాలం ముగిసిందని, నూతన పాలకవర్గాన్ని ఏర్పాటు చేసేందుకు చొరవ చూపాలని విన్నవించారు. మంత్రిని కలిసిన వారిలో కాంగ్రెస్ గ్రామ శాఖ అధ్యక్షుడు చిన్నరోళ్లపాటి రాజశేఖర్, నాయకులు భానూరి లక్ష్మణ్, బోడపట్ల ఆనందం, రోళ్లపాటి సత్యనారాయణ తదితరులు ఉన్నారు.

మొక్కలను నాటి, సంరక్షించాలి

- సంగారెడ్డి కలెక్టర్ వల్లూరు క్రాంతి

సంగారెడ్డి రూరల్, ఫిబ్రవరి 9: ప్రతీ ఒక్కరు మొక్కలను నాటి సంరక్షించాలని, మొక్కలను రక్షిస్తే అవి మనషులను రక్షిస్తాయని సంగారెడ్డి కలెక్టర్ వల్లూరు క్రాంతి అన్నారు. ప్రత్యేక పారిశుధ్య వారోత్సవాల్లో భాగంగా కంది మండల కేంద్రంలో శుక్రవారం ఆమె పర్యటించారు. పల్లె ప్రకృతివనాన్ని సందర్శించి, అక్కడున్న తెలంగాణ తల్లి విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. భవిష్యత్తు తరాలకు స్వచ్ఛమైన వాతావరణం అందించేందుకు మొక్కలను నాటి రక్షించాలని పిలుపునిచ్చారు. అనంతరం కందిలోని జడ్పీహెచ్ఎస్‌ను తనిఖీ చేశారు. హాజరు రిజిస్టర్‌ను పరిశీలించారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య మరింత పెరిగేలా ఉపాధ్యాయులు కృషి చేయాలని సూచించారు. పాఠశాలలో నెలకొన్న సమస్యలను కలెక్టర్ తెలుసుకున్నారు.

రుద్రారం గ్రామంలో పర్యటన

పటాన్‌చెరు రూరల్: పారిశుధ్య వారోత్సవాల్లో ప్రజలందరూ భాగస్వాములై గ్రామంలోని సమస్యలను పరిష్కరించుకోవాలని కలెక్టర్ వల్లూరు క్రాంతి సూచించారు. శుక్రవారం రుద్రారం గ్రామాన్ని ఆమె సందర్శించి, గణపతి దేవాలయంలో పూజలు నిర్వహించారు. గణపతి ఆలయ ప్రాంగణంలో గ్రీన్ ఇండియా చాలెంజ్ కార్యక్రమంలో భాగంగా ఏర్పాటు చేసిన ప్రకృతి వనాన్ని కలెక్టర్ సందర్శించారు. పారిశుధ్య వారోత్సవాల్లో గ్రామంలో నెలకొన్న పరిష్కరించుకోవాలన్నారు. గ్రామ పరిధిలో గల రెస్టారెంట్లు, దాబాలు రెండు వారాల్లోగా కంపోస్ట్ పిట్స్ ఏర్పాటు చేసుకునేలా చర్యలు తీసుకోవాలని పంచాయతీ కార్యదర్శిని ఆదేశించారు.


కంది మండల కేంద్రంలోని పల్లె ప్రకృతి వనంలో పర్యటిస్తున్న కలెక్టర్ వల్లూరు క్రాంతి

వంద శాతం ఫలితాలు సాధించాలి: డీఈవో


సమావేశంలో మాట్లాడుతున్న డీఈవో వెంకటేశ్వర్లు

సంగారెడ్డి అర్బన్, ఫిబ్రవరి 9: కేజీబీవీలో విద్యనభ్యసిస్తున్న పదవ తరగతి, ఇంటర్మీడియట్ విద్యార్థులు వంద శాతం ఫలితాలు సాధించాలని డీఈవో వెంకటేశ్వర్లు సూచించారు. సంగారెడ్డిలోని సమగ్ర శిక్షా కార్యాలయంలో శుక్రవారం కేజీబీవీ ప్రత్యేకాధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఈవో మాట్లాడుతూ.. విద్యార్థులకు అందించే భోజనం విషయంలో శ్రద్ధ వహించాలని సూచించారు. మెనూ ప్రకారం సకాలంలో భోజనం అందించాలని, పాఠశాలల్లో విపత్తు నిర్వహణ, గ్యాస్ లీకేజీ సమస్యలు అధిగమించాలని సూచించారు. కేజీబీవీల్లో నెలకొన్న సమస్యలు, ఫైర్ సేఫ్టీ, తాగునీరు, మరుగుదొడ్ల నిర్వహణలో ఎలాంటి లోపాలు లేకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సమావేశంలో జిల్లా బాలికా విద్య సమన్వయకర్త సుప్రియ పాల్గొన్నారు.

పీఆర్టీయూ ఆవిర్భావ వేడుకలు


మెదక్‌లో జెండాను ఎగురవేసిన జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్

మెదక్ అర్బన్/నర్సాపూర్/జోగిపేట/అల్లాదుర్గం, ఫిబ్రవరి 9: జిల్లా కేంద్రంలోని శుక్రవారం టీఎస్ పీఆర్టీయూ కార్యాలయం వద్ద 53వ ఆవిర్భావ వేడుకలను నిర్వహించారు. పీఆర్టీయూ జెండాను ఎగురవేశారు. ఉపాధ్యాయ విద్యారంగ సమస్యల పరిష్కారం కోసం పీఆర్టీయూ నిరంతరం పోరాడుతుందని సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సబ్బని శ్రీనివాస్, సుంకరి కృష్ణ స్పష్టం చేశారు. వేడుకల్లో రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు మల్లారెడ్డి, రవి, మాజీ అధ్యక్షుడు సత్యనారాయణరెడ్డి, మహేష్, సతీష్‌రావు, చంద్రశేఖర్, సంతోస్‌కుమార్, వీరేందర్, సంగమేశ్వర్ పాల్గొన్నారు. నర్సాపూర్‌లో పీఆర్టీయూ ఆవిర్భావ దినోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో మండలాధ్యక్షుడు లక్ష్మీనారాయణ, ప్రధాన కార్యదర్శి సామ్యా, ఇతర ప్రతినిధులు ఎల్‌కె చందర్, స్వరూప, వీరేశం, లాలు, ధన్‌సింగ్, చెన్నా, ప్రసన్నకుమార్, రవీందర్, వెంకటస్వామి, బీమ్లా పాల్గొన్నారు. అల్లాదుర్గంలో పీఆర్టీయూ మండల శాఖా ఆధ్వర్యంలో ఎంఈవో కార్యాలయ ఆవరణలో ఆవిర్భావ వేడుకలను నిర్వహించారు. కార్యక్రమంలో మండలాధ్యక్షుడు జనార్ధన్, మండల ప్రధాన కార్యదర్శి రంజానాయక్, కిష్టయ్య, నాగరాజు, నాగభూషణం తదితరులు పాల్గొన్నారు. పీఆర్‌టీయూ 53వ ఆవిర్భావ దినోత్సవాన్ని జోగిపేటలో అందోలు మండల పీఆర్టీయూ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. పీఆర్‌టీయూ సభ్యులుగా ఉండి పదవీ విరమణ పొందిన ఉపాధ్యాయులను సన్మానించారు. కార్యక్రమంలో మండలాధ్యక్షుడు నరోత్తం, ప్రధాన కార్యదర్శి రాజమల్లు, జిల్లా సభ్యులు జంగిటి అనిల్, సుభాష్, నవీన్, అల్లె మహేందర్, రమేశ్, మంజన్యానాయక్, వీ.బీ శ్రీనివాస్, అజిత్ ప్రసాద్, జనార్ధన్ రెడ్డి, మహేశ్‌చారి, మాయా చారి, తదితరులు పాల్గొన్నారు.

సేంద్రియ వ్యవసాయంతో అధిక దిగుబడులు


సజ్జాపూర్‌లో బొప్పాయి తోటను పరిశీలిస్తున్న డీఏవో నరసింహారావు

కోహీర్ ఫిబ్రవరి 9: సేంద్రియ పద్ధతులను పాటించి పంటలను సాగు చేస్తే అధిక దిగుబడులు సాధించవచ్చని జిల్లా వ్యవసాయ సంచాలకుడు నరసింహరావు అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని సజాపూర్ గ్రామంలో పంట పొలాలను ఆయన పరిశీలించారు. మొక్కజొన్న, అల్లం, బొప్పాయి సాగును పరిశీలించిన డీఏవో.. పంట విత్తన ఉత్పత్తి గురించి రైతులకు వివరించారు. పంటలకు వస్తున్న రోగాల నివారణకు వాడే మందులను రైతులకు తెలియజేశారు. మొక్కజొన్న పంటలో కత్తెర పురుగు నివారణ పద్ధతులను వివరించారు. పంటలకు ఎలాంటి రోగాలు వచ్చినా వ్యవసాయ అధికారుల సూచన మేరకే మందులు వాడాలన్నారు. ఆయన వెంట ఏడీఏ భిక్షపతి, ఏవో నవీన్, ఏఈవో మౌనిక, మాజీ సర్పంచ్ నర్సింహులు, పంచాయతీ కార్యదర్శి అశోక్‌రెడ్డి ఉన్నారు.

వరి పంటలను పరిశీలించిన ఏడీఏ

జోగిపేట: మండలంలోని మన్‌సాన్‌పల్లి గ్రామంలో రైతులు వరి పొలాలను జోగిపేట డివిజన్ వ్యవసాయాధికారి (ఏడీఏ) అరుణగౌడ్ పరిశీలించారు. వరి పంటకు కాండం తొలుచు పురుగు ఆశించే ప్రమాదం ఎక్కువగా ఉన్నదని, నివారణ కోసం కార్‌టాప్ హైడ్రోక్లోరైడ్ 4 జీ గుళికలను ఎకరాకు 8 కిలోల చొప్పున వేసుకోవాలని సూచించారు. లేదా క్లోరంటా నీలిప్రోల్ 18.55 సీసీ (కోరాజిన్) మందును ఎకరాకు 60 మిల్లీ గ్రాములను పిచికారి చేసుకోవాలన్నారు. ఆమె వెంట ఏఈవో అనిత ఉన్నారు.

'ఫార్మా రంగానికి మంచి భవిష్యత్తు'

నర్సాపూర్, ఫిబ్రవరి 9: ఫార్మా రంగానికి రానున్న కాలంలో మరింత మంచి భవిష్యత్తు ఉంటుందని నోవార్టిస్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ బయోమెడికల్ డైరెక్టర్ జగన్నాథ్‌కోట పేర్కొన్నారు. నర్సాపూర్ సమీపంలోని విష్ణు ఫార్మసీ కాలేజీలో రెండు రోజుల పాటు ఔషధ్-2024 పేరిట నిర్వహించిన సదస్సు శుక్రవారం ముగిసింది. ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఫార్మా రంగం ప్రపంచవ్యాప్తంగా విస్తరిస్తుందని అందుకు తగ్గట్టు పరిశోధనలు కూడా పెరిగి మరింత మెరుగైన ఫలితాలు సాధించాలని విద్యార్థులకు సూచించారు. కార్యక్రమంలో విష్ణు ఫార్మసీ కాలేజీ, ఎంఎన్‌ఆర్, గీతాంజలి, స్వామివేకనందా కాలేజీల విద్యార్థులు పాల్గొని తమ ప్రతిభను చాటారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రమేష్, హెచ్‌వోడీ వనిత, ప్రోగ్రాం కన్వీనర్ జాహ్నవి పాల్గొన్నారు.

13మంది పేకాటరాయుళ్లపై కేసు

శివ్వంపేట, ఫిబ్రవరి 9: పేకాట శిబిరంపై పోలీసులు దాడి చేసి 13 మందిపై కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు... శివ్వంపేట మండల పరిధిలోని ఉసిరికపల్లి శివారులోని ఓ ఫామ్‌హౌస్‌లో పేకాట ఆడుతున్నట్లు శివ్వంపేట పోలీసులకు శుక్రవారం సమాచారం వచ్చింది. శుక్రవారం సాయంత్రం పేకాట శిబిరంపై దాడి చేసి రూ.2.10లక్షలు స్వాధీనం చేసుకొని, 13మందిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ మహిపాల్‌రెడ్డి తెలిపారు.

రేషన్ షాపును సందర్శించిన విద్యార్థులు

చేగుంట, ఫిబ్రవరి 9: చేగుంట మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఎనిమిదవ తరగతి విద్యార్థులు ప్రాజెక్ట్ వర్క్ షాప్‌లో భాగంగా శుక్రవారం మండల కేంద్రంలోని రెండవ రేషన్‌షాపును సందర్శించారు. రేషన్ షాప్ నిర్వాహకులు విద్యార్థులకు రేషన్ బియ్యం పంపిణీ, రేషన్‌కార్డుల పనితీరును వివరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు చల్లా లక్ష్మణ్, రాధ, సీఆర్పీ రమేష్, విద్యార్థులు పాల్గొన్నారు.

సంజీవన్‌రావుపేటలో గావ్‌చలో అభియాన్

నారాయణఖేడ్, ఫిబ్రవరి 9: గావ్‌చలో అభియాన్‌లో భాగంగా బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు సాయిరాం ఆధ్వర్యంలో సంజీవన్‌రావుపేటలో పర్యటించారు. ఈ సందర్భంగా కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ సంక్షేమ పథకాలను వివరిస్తూ ముద్రించిన కరపత్రాలను గ్రామ రేషన్ దుకాణంలో, ఫర్టిలైజర్, కిరాణ దుకాణాల్లో లబ్ధిదారులు, రైతులు, స్థానికులకు పంపిణీ చేశారు. సంక్షేమ పథకాలతో పాటు అభివృద్ధి పనులను గురించి వివరించారు. మాజీ సర్పంచ్ ఎంబరి విఠల్‌ను కలిసి కేంద్ర ప్రభుత్వ పథకాల పట్ల అభిప్రాయాన్ని తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు కిష్టయ్య, రాజు, విఠల్, తదితరులు పాల్గొన్నారు.

టీఎస్‌యూటీఎఫ్ మండల నూతన కమిటీ

నర్సాపూర్, ఫిబ్రవరి 9: నర్సాపూర్ మండల టీఎస్‌యూటీఎఫ్ నూతన కమిటీని శుక్రవారం యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్‌రావు, ప్రధాన కార్యదర్శి పద్మారావు ఆధ్వర్యంలో ఎన్నుకున్నారు. మండలాధ్యక్షుడిగా కె.రవి, ఉపాధ్యక్షులుగా అస్రాషాహీన్, ప్రధాన కార్యదర్శిగా నాగుల్‌మీరా, కోశాధికారిగా కనకరాజు ఎన్నికయ్యారు.

విద్యార్థిని తల్లితండ్రులకు డీఈవో కౌన్సెలింగ్

చిన్నశంకరంపేట, ఫిబ్రవరి 9: మండలంలోని దర్పల్లి పాఠశాలను డీఈవో రాధకిషన్ శుక్రవారం సందర్శించారు. పదవ తరగతి హాజరు పట్టికను పరిశీలించగా అచ్చంపేట గ్రామానికి చెందిన పదవ తరగతి విద్యార్థిని పాఠశాలకు రాలేదని తెలిసింది. దీంతో డీఈవో రాధకిషన్, ఎంఈవో బుచ్చయ్య నాయక్, హెచ్‌ఎంతో కలిసి విద్యార్థిని ఇంటికి వెళ్లారు. బడికి ఎందుకు పంపిచడంలేదని తల్లిదండ్రులకు ప్రశ్నించి, కౌన్సెలింగ్ ఇచ్చారు. విద్యార్థిని చదువు, భవిష్యత్తు పట్ల అశ్రద్ధ చూపరాదన్నారు.

భూ కబ్జాదారులపై ఫిర్యాదు

మనోహరాబాద్, ఫిబ్రవరి 9: తన భూమిని కబ్జా చేసి అధికారుల అండదండలతో పరిశ్రమను నిర్మిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని హైదరాబాద్‌లో శుక్రవారం నిర్వహించిన ప్రజావాణిలో మహ్మద్ దావుద్ ఫిర్యాదు చేశాడు.

ఎయిడ్స్ రహిత సమాజ నిర్మాణానికి కృషి

మెదక్ అర్బన్, ఫిబ్రవరి 9: ఎయిడ్స్ రహిత సమాజ నిర్మాణానికి అందరూ కృషి చేయాలని నెహ్రూ యువ కేంద్ర ఉమ్మడి జిల్లా యువజన అధికారి రంజిత్‌రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో హెచ్‌ఐవీ, ఎయిడ్స్‌పై నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నా హెచ్‌ఐవీ నిర్మూలనపై విద్యార్థులకు అవగాహన కల్పించారు.

ముమ్మరంగా ఉపాధి పనులు

నాగల్‌గిద్ద, ఫిబ్రవరి 9: మండల పరిధిలోని నాగల్‌గిద్ద, ముక్టాపూర్ గ్రామాల్లో శుక్రవారం ఉపాధి హామీ పనులు ముమ్మరంగా కొనసాగుతున్నాయి. పనులను ఏపీవో మురళీకృష్ణ, టీఏ సోనేష్ పరిశీలించారు.

మాదారం స్టోన్ క్రషర్లపై అధికారులకు ఫిర్యాదు

జిన్నారం, ఫిబ్రవరి 9: మాదారం పరిధిలోని స్టోన్ క్రషర్ల పేలుళ్ల, క్వారీల నిర్వాహణపై స్థానిక యువకు మైనింగ్, పీసీబీ అధికారులకు ఫిర్యాదు చేశారు. శుక్రవారం యువజన సంఘాల నాయకులు విజయ్‌గౌడ్, రమణాసింగ్, సుదర్శన్, బాలేష్, వెంకటేశ్‌గౌడ్, గణేష్, నాగరాజు, రమేష్‌లు సెంట్రల్ మైనింగ్ సేఫ్టీ డిప్యూటీ డైరెక్టర్ ప్రేమ్‌కుమార్, సైన్స్ అండ్ జ్యాలజి రాష్ట్ర డైరెక్టర్ సుశీల్‌కుమార్, పీసీబీ ఎంఎస్ రాజీవ్‌శర్మలను కలిసి ఫిర్యాదు చేశారు. నిబంధనలు పాటించని స్టోన్ క్రషర్లపై విచారణ జరిపి, చర్యలు తీసుకోవాలని అధికారులను కోరినట్లు యువజన సంఘాల నాయకులు తెలిపారు.

పరిసరాల శుభ్రతతో ఆరోగ్యం

నిజాంపేట, ఫిబ్రవరి 9: పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకుంటే ప్రతి ఒక్కరు ఆరోగ్యంగా ఉంటారని పంచాయతీ కార్యదర్శి ఆరిఫ్ హుస్సేన్ అన్నారు. మండల పరిధిలోని నంది గామ గ్రామంలో శుక్రవారం స్పెషల్ డ్రైవ్ శానిటేషన్ కార్యక్రమంలో భాగంగా చెత్తను తొలగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బహిరంగ ప్రదేశాల్లో చెత్తను వేయకూడదని ప్రజలకు సూచించారు. మురుగు కాలువల్లో మలాతియాన్ పౌడర్ చల్లించారు.

రేపు కన్యకాపరమేశ్వరీ మాత ఆత్మార్పణ దినం

సంగారెడ్డి రూరల్, ఫిబ్రవరి 9: ఈ నెల 11న సంగారెడ్డి పట్టణ శివారులోని వాసవీ కన్యకాపరమేశ్వరి మాత ఆత్మార్పణ దినం సందర్భంగా ప్రత్యేక కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్టు ఆలయ కమిటీ చైర్మన్ తోపాజి అనంతకిషన్ శుక్రవారం తెలిపారు. ఉదయం 11 గంటలకు అమ్మవారికి యజ్ఞం, వాసవి మాత పఠనం, కుంకుమార్చన తదితర కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఆయన వెల్లడించారు. అనంతరం భక్తులకు అన్నప్రసాద వితరణ ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమానికి పట్టణంలోని భక్తులు అధిక సంఖ్యలో హాజరై, అమ్మవారి ఆశీస్సులు పొందాలని ఆయన కోరారు.

ప్లాస్టిక్ బాటిళ్లలో పెట్రోల్ పోస్తే
పెట్రోల్ బంక్ లైసెన్సును రద్దు చేస్తాం

- సంగారెడ్డి ఎస్పీ రూపేష్

సంగారెడ్డి క్రైం, ఫిబ్రవరి 9: వినియోగదారులకు ప్లాస్టిక్ బాటిళ్లలో పెట్రోల్ పోస్తే బంక్ లైసెన్సులు రద్దు చేస్తామని జిల్లా ఎస్పీ చెన్నూరి రూపేష్ హెచ్చరించారు. ఈ మేరకు శుక్రవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. జిల్లాలో గల పెట్రోల్ బంక్ యజమానులు పెట్రోలియం యాక్ట్-2002 ప్రకారం పెట్రోల్‌ను ప్లాస్టిక్ బాటిళ్లలో, క్యాన్‌లలో పోయడానికి అనుమతి లేదన్నారు. ఎవరైనా ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రతి పెట్రోల్ బంక్‌లలో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని, ఆ కెమెరాల స్టోరేజీ 90 రోజుల వరకు ఉండే విధంగా హార్డ్‌డిస్క్‌లను ఏర్పాటు చేసుకోవాలన్నారు.

వాహనాల నంబరు ప్లేట్లపై స్పెషల్ డ్రైవ్

- మెదక్ ఎస్పీ బాలస్వామి

మెదక్ అర్బన్, ఫిబ్రవరి 9: మోటారు వాహన చట్ట ప్రకారం నంబరు ప్లేట్లు సరిగా లేని వాహనాల్ని గుర్తించేందుకు జిల్లా వ్యాప్తంగా స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు ఎస్పీ బాలస్వామి శుక్రవారం ప్రకటనలో తెలిపారు. జిల్లాలో చాలా మంది వాహనదారులు వాహనాలకు నంబరు ప్లేట్లు లేకుండా నడుపుతున్నారని, అది చట్టరీత్యా నేరమని హెచ్చరించారు. ఎంవీ చట్టం ప్రకారం రూ.200 జరిమానా ఉంటుందని, రెండోసారి రూ.500ల జరిమానా ఉంటుందన్నారు. అయినా అలాగే నడిపితే వాహనాన్ని సీజ్ చేస్తామన్నారు.

ఆ ప్రచారం అబద్ధం


గత రెండు రోజుల నుంచి పిల్లలను తీసుకెళ్తున్నట్లు వాట్సాప్ గ్రూపుల్లో వస్తున్న ప్రచారం నిజం కాదని ఎస్పీ బాలస్వామి తెలిపారు. తప్పుడు సమాచారాన్ని సోషల్ మీడియోలో పోస్టు చేసే వారిపై పోలీసు విభాగం నిఘా పెడుతుందన్నారు. తమ ప్రాంతాల్లో వాటికి సంబంధించిన ఏదైనా సమచారం ఉంటే స్థానిక పోలీసులకు, డయల్ 100కు కాల్ చేయాలన్నారు.

'పెండింగ్ డీఏలు చెల్లించండి'


మాట్లాడుతున్న యూటీఎఫ్ రాష్ట్ర సభ్యుడు కాశీనాథ్

నారాయణఖేడ్, ఫిబ్రవరి 9: ఉద్యోగ, ఉపాధ్యాయులకు పెండింగ్‌లో ఉన్న మూడు డీఏలను తక్షణమే చెల్లించాలని టీఎస్ యూటీఎఫ్ రాష్ట్ర కమిటీ సభ్యుడు కాశీనాథ్ జాదవ్ డిమాండ్ చేశారు. నారాయణఖేడ్‌లోని సంఘం కార్యాలయంలో శుక్రవారం జరిగిన కంగ్టి మండల కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. పెండింగ్ బిల్లులు విడుదల చేయాలని, బకాయి పడ్డ 3 డీఏలకు సంబంధించిన జీవోను విడుదల చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. సమావేశంలో సంఘం నారాయణఖేడ్ మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు హరిసింగ్, రాజు, నాయకులు అంజయ్య, స్వామి, జైపాల్, రవీందర్, మహేష్, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

ఇచ్చిన హామీలను నెరవేర్చాలి


మాసాన్‌పల్లిలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి

పెద్దశంకరంపేట/కల్హేర్, ఫిబ్రవరి 9: ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను నెరవేర్చాలని నారాయణఖేడ్ మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి డిమాండ్ చేశారు. శుక్రవారం పెద్దశంకరంపేట మండలం కొత్తపేట శివారులో, కల్హేరు మండల పరిధిలోని మాసాన్‌పల్లి శివారులో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో తాజా మాజీ సర్పంచులను ఎమ్మెల్యే సన్మానించారు. అనంతరం ఆయన మాట్లాడారు. పదవులు పోయినా ప్రజలకు అందుబాటులో ఉండి సేవ చేయాలని ఆయన సూచించారు. ప్రభుత్వం ఏర్పడిన తొలి రోజునే హామీలు నెరవేరుస్తామని చెప్పి ప్రజలను మోసం చేస్తున్నదని విమర్శించారు. సమావేశంలో ఎంపీపీ జంగం శ్రీనివాస్, జడ్పీటీసీ విజయరామరాజు, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు మురళీపంతులు, వైస్ ఎంపీపీ లక్ష్మీరమేష్, ఎంపీటీసీ వీణసుభాష్‌గౌడ్, దత్తు పాల్గొన్నారు. మాసాన్‌పల్లిలో కల్హేర్ జడ్పీటీసీ నర్సింహారెడ్డి, వైస్ ఎంపీపీ నారాయణరెడ్డి, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు రాంసింగ్, యువత మండలాధ్యక్షుడు సంతోష్‌కుమార్, మైనార్టీ సెల్ అధ్యక్షుడు నవాబ్ పటేల్, క్రిష్టాపూర్ పీఏసీఎస్ చైర్మన్ క్రిష్టాగౌడ్, ఎంపీటీసీ సంగప్ప పాల్గొన్నారు.

అర్హులందరికీ ఆరు గ్యారంటీలు అందించడమే లక్ష్యం

- జిల్లా వ్యాప్తంగా లక్ష 75 వేల దరఖాస్తులు
- మెదక్ కలెక్టర్ రాజర్షిషా

చిన్నశంకరంపేట, ఫిబ్రవరి 9: ప్రజాపాలనలో దరఖాస్తులు చేసుకున్న అర్హులందరికీ ఆరు గ్యారంటీలు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని మెదకక్ కలెక్టర్ రాజార్షిషా అన్నారు. స్పెషల్ డ్రైవ్ శానిటేషన్ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం చిన్నశంకరంపేట మండలంలోని దర్పల్లి గ్రామంలో కలెక్టర్ పర్యటించారు. గ్రామాభివృద్ధిపై గ్రామస్థులతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జిల్లా వ్యాప్తంగా ప్రజాపాలనలో లక్షా75వేల దరఖాస్తులు వచ్చాయని తెలిపారు. 75వేల దరఖాస్తుల్లో తప్పులు దొర్లాయని, 80వేల దరఖాస్తులు సక్రమంగా ఉన్నాయని తెలిపారు దరఖాస్తుల్లో తప్పులను సరి చేసేందుకు గ్రామాల్లోని ప్రత్యేకాధికారులు మొబైల్ యాప్ ద్వారా కృషి చేస్తున్నారని వెల్లడించారు. గ్రామానికి ఎన్ఆర్ఈజీఎస్ నిధులతో రెండు అంగన్‌వాడీ కేంద్రాలు, పైప్‌లైన్‌కు ఎఫ్‌డీఎఫ్ నిధులు మంజూరు చేసినట్లు కలెక్టర్ వెల్లడించారు. అనంతరం గ్రామంలోని వీధులను సందర్శించి డ్రైనేజీలను పరిశీలించారు. స్కూల్‌లను సందర్శించి విద్యార్థులతో ముచ్చటించారు. పరీక్షల్లో పదవ తరగతి విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించాలని సూచించారు. పాఠశాల స్థితిగతులపై ఉపాధ్యాయులను అడిగి తెలుసుకున్నారు. ఆయనవెంట డీఈవో రాధకిషన్, తహసీల్దార్ మన్నన్, ఎంపీడీవో ప్రవీణ్, ఎంఈవో బుచ్చయ్య నాయక్, ఆర్ఐ గోవింద్, పంచాయతీ కార్యదర్శి సాయిగౌడ్, మాజీ సర్పంచ్ సిద్ధిరాంరెడ్డి, మాజీ ఎంపీటీసీలు అంజాగౌడ్, శ్రీనివాస్ ఉన్నారు.


దర్పల్లి ప్రైమరీ స్కూల్ విద్యార్థులను పాఠ్యాంశాల గురించి అడిగి తెలుసుకుంటున్న కలెక్టర్

ప్రజాపాలన దరఖాస్తుల పరిశీలన

తూప్రాన్: ప్రజాపాలనలో వచ్చిన దరఖాస్తులపై క్షేత్రస్థాయిలో పరిశీలన చేపట్టారు. తూప్రాన్ పట్టణ మున్సిపల్ పరిధిలో ఆన్‌లైన్ దరఖాస్తులపై మున్సిపల్ కమిషనర్ ఖాజా మోయిజుద్దీన్ ఇంటింటికీ వెళ్లి తనిఖీ చేశారు. తనిఖీలో ఆర్ఐ బట్టి రమేష్, వార్డు సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

ఆశవర్కర్లపై బెదిరింపులు ఆపి, వేతనాలు చెల్లించాలి

- సీఐటీయూ జిల్లా కార్యదర్శి సాయిలు డిమాండ్


సంగారెడ్డి కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న ఆశ కార్యకర్తలు

సంగారెడ్డి రూరల్, ఫిబ్రవరి 9: ఏఎన్‌సీ డెలివరీ పేరుతో టార్గెట్ ఇచ్చి ఆశ వర్కర్లను అధికారులు బెదిరించడం ఆపాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి సాయిలు డిమాండ్ చేశారు. ఆశవర్కర్లపై బెదిరింపులు ఆపి, వేతనాలు చెల్లించాలని కోరుతూ సంగారెడ్డి కలెక్టరేట్ ఎదుట శుక్రవారం సీఐటీయూ ఆధ్వర్యంలో ఆశకార్యకర్తలు ధర్నా చేశారు. ఈ సందర్భంగా సాయిలు మాట్లాడుతూ.. 18 సంవత్సరాలుగా వైద్యారోగ్య శాఖలో పనిచేస్తున్నప్పటికీ కనీస వేతనం, ఉద్యోగ భద్రత, ఈఎస్ఐ, పీఎఫ్ అమలు చేయడం లేదన్నారు. తక్కువ వేతనంతో పనిచేస్తున్నా ఆశ కార్యకర్తలకు సకాలంలో వేతనాలు అందక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వాపోయారు. రెండు నెలల నుంచి వేతనాలు రాకపోవడంతో కుటుంబ పోషణ భారమైందని ఆవేదన వ్యక్తం చేశారు. బకాయి వేతనాలు ఇచ్చి, పెరుగుతున్న ధరలకనుగుణంగా కనీస వేతనం రూ.18వేలు ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అనంతరం డీఆర్‌వో నగేష్‌గౌడ్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి యాదగిరి, యూనియన్ నాయకులు యశోధ, వీరమణి, ప్రశాంతి, గంగా, వైష్ణవి, తుల్జమ్మ తదితరులు పాల్గొన్నారు.

మెదక్ కలెక్టరేట్ ఎదుట..

మెదక్ అర్బన్: పెండింగ్ వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం మెదక్ కలెక్టరేట్ ఎదుట ఆశ వర్కర్లు ధర్నాకు దిగారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రెండు నెలల వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. నెలకు రూ.18 వేల వేతనం నిర్ణయించాలని, పీఎస్, ఈఎస్ఐ సౌకర్యాలు, ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు పాల్గొన్నారు.

పాఠశాలల్లో సైన్స్ డే

వెల్దుర్తి, ఫిబ్రవరి 9: జిల్లా విద్యాశాఖ ఆదేశాల మేరకు వెల్దుర్తి ఉన్నత పాఠశాలలో శుక్రవారం జాతీయ సైన్స్ దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా మండల స్థాయిలో విద్యార్థులకు చిత్రలేఖనం, ఉపన్యాసం, కవిత్వం, పాటల పోటీలు నిర్వహించారు. అనంతరం ఏంఈవో యాదగిరి మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ విజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని సూచించారు. మండల స్థాయిలో ప్రతిభను కనబరిచిన విద్యార్థులను జిల్లా స్థాయి పోటీలకు పంపుతామని చెప్పారు. మనిషి జీవితంలో సైన్స్ ఎంతో ముఖ్యమైదని, ప్రకృతి పరమైన ప్రక్రియల వెనక ఉన్న సైన్స్‌ను తెలుసుకోవాలని విద్యార్థులకు సూచించారు.

- **చేగుంట:** చేగుంట మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలో శుక్రవారం మండల స్థాయి సైన్స్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో మండల స్థాయి విజేతలుగా నలుగురు నిలిచారు. వారు జిల్లా స్థాయిలో జరిగే పోటీల్లో పాల్గొంటారని మండల నోడల్ అధికారి నీరజ పేర్కొన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు సుధాకర్‌రెడ్డి, శ్రావంతి, శ్రీనివాస్, వాణి, సౌజన్య, మనోహర్, భవాని, నాగరాజు, సౌజన్య, చల్లా లక్ష్మణ్, వెంకటేష్ పాల్గొన్నారు.


మనోహరాబాద్‌లో నిర్వహించిన పోటీల్లో గెలుపొందిన విద్యార్థులు

- **మనోహరాబాద్:** మండల కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాలలో సైన్స్ డేను నిర్వహించారు. ఈ సందర్భంగా మండలస్థాయిలో విద్యార్థులకు పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో మండల నోడల్ అధికారి వెంకటస్వామి, ప్రధానోపాధ్యాయుడు రహెనా సుల్తానా పాల్గొన్నారు.

వైభవంగా రేణుకా ఎల్లమ్మ కల్యాణం


రేణుకా ఎల్లమ్మ కల్యాణం నిర్వహిస్తున్న దృశ్యం

చేగుంట, ఫిబ్రవరి 9: చేగుంట మండలం కర్నాల్‌పల్లిలో వెలసిన రేణుకా ఎల్లమ్మ కల్యాణ మహోత్సవం శుక్రవారం అంగరంగ వైభవంగా జరిగింది. ఆలయ 24వ వార్షికోత్సవం సందర్భంగా మాఘ అమావాస్యాన్ని పురస్కరించుకుని గౌడ సంఘం, ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అమ్మవారి కల్యాణం నిర్వహించారు. మండలంలోని వివిధ గ్రామాలతో పాటు మెదక్, నిజామాబాద్, హైదరాబాద్ జిల్లాల నుంచి భారీ సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. దీంతో ఆలయం భక్తులతో కిటకిటలాడింది. చేగుంట ఎంపీపీ మాసుల శ్రీనివాస్, ప్రజాప్రతినిధులు, అధికారులు అమ్మవారిని దర్శించుకున్నారు. మిద్దెరాములు ఒగ్గు కళా బృందంచే అమ్మవారి జీవిత చరిత్రను నిర్వహిస్తారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా ఆలయ కమిటీ, గౌడ సంఘం ఆధ్వర్యంలో అన్ని ఏర్పాట్లు చేశారు.

పీవీకి భారతరత్న ప్రకటించడంపై సంబురాలు

మెదక్ అర్బన్, ఫిబ్రవరి 9: మాజీ ప్రధాని పీవీ నరసింహారావుకు కేంద్ర ప్రభుత్వం భారతరత్న ప్రకటించడంపై శుక్రవారం బీజేపీ ఆధ్వర్యంలో మెదక్ పట్టణంలో సంబురాలు నిర్వహించారు. పీవీకి భారత రత్న ప్రకటించడం తెలంగాణకు గర్వకారణమని బీజేపీ జిల్లా అధ్యక్షుడు గడ్డం శ్రీనివాస్ పేర్కొన్నారు. పీవీ ఆర్థిక సంస్కరణలతో దేశాన్ని ముందుకు నడిపించారని కొనియాడారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు మురళీధర్‌యాదవ్, నిజాంపేట జడ్పీటీసీ పంజా విజయ్‌కుమార్, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎంఎల్ఎన్ రెడ్డి, అసెంబ్లీ కన్వీనర్ మధు, పట్టణ అధ్యక్షుడు ప్రసాద్, బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు సతీష్‌పటేల్, నాయకులు కాశీనాథ్, మధు, రాజు, రాహుల్, సన్నీ, శశాంక్ తదితరులు పాల్గొన్నారు.

- **నారాయణఖేడ్:** పీవీకి భారతరత్న ప్రకటించడంపై నారాయణఖేడ్‌లో బీజేపీ నాయకులు సంబురాలు జరుపుకున్నారు. కార్యక్రమంలో బీజేపీ నియోజకవర్గ కన్వీనర్ రజనీకాంత్, మున్సిపాలిటీ ఇన్‌చార్జి సుగుణాకర్, సుధాకర్, వెంకట్‌రెడ్డి, సాయేందర్, రాజుగౌడ్, పట్నం మాణిక్, లోకేష్, రాజు, సంజీవ్ యాదవ్, తదితరులు పాల్గొన్నారు.
- **పెద్దశంకరంపేట:** పీవీకి భారత రత్న పురస్కారం ప్రకటించడం పట్ల బీజేపీ మండలాధ్యక్షుడు కోణం విఠల్ హర్షం వ్యక్తం చేశారు. శుక్రవారం పెద్దశంకరంపేటలోని పార్టీ కార్యాలయంలో ఆయన మాట్లాడారు. భారతరత్న ప్రకటించడం పట్ల ప్రధాని మోదీకి కృతజ్ఞతలు తెలిపారు. ఆయన వెంట మండల నాయకులు బండాల శ్రావణ్‌కుమార్, మంగలి కృష్ణ, బొగుడాల శ్రావణ్ ఉన్నారు.


మెదక్‌లో పీవీ చిత్రపటం ఎదుట మిఠాయిలు తినిపించుకుంటున్న బీజేపీ నాయకులు

మాఘ అమావాస్య ఉత్సవాల్లో ఎమ్మెల్యే

మనూరు, ఫిబ్రవరి 9: మనూరు మండలం బోరంచలోని మంజీరా నది ఒడ్డున వెలసిన సంగమేశ్వర ఆలయంలో శుక్రవారం నిర్వహించిన మాఘ అమావాస్య ఉత్సవాల్లో ఎమ్మెల్యే పట్లోళ్ల సంజీవరెడ్డి దంపతులు పాల్గొన్నారు. మంజీరాలో స్నానాలు చేసి సంగమేశ్వర ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కాగా ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో వచ్చి మంజీరా నదిలో పుణ్యస్నానాలు చేశారు.

13 నుంచి చల్లగిరి ఆలయ ఉత్సవాలు

నారాయణఖేడ్, ఫిబ్రవరి 9: సిర్గాపూర్ మండలం కడ్పల్ శివారులో గుట్టపై దట్టమైన అరణ్యంలో వెలసిన చల్లగిరి లక్ష్మీవెంకటేశ్వర స్వామి ఆలయ బ్రహ్మోత్సవాలు ఈ నెల 13 నుంచి 15 వరకు నిర్వహించనున్నారు. వైభవంగా ఉత్సవాలను నిర్వహించడానికి ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ దేవాలయాన్ని భక్తులు చక్రతీర్థం అని పిలుస్తుంటారు. 13న స్వస్తి వచనం, అభిషేకం, సహస్రనామార్చన, 14న కుంకుమార్చన, హోమం, స్వామివారి తిరుకల్యాణం, గరుడసేవ, మంత్రపుష్పం, 15న వేద పారాయణం, చక్రతీర్థం, పూర్ణాహుతితో పాటు వివిధ కార్యక్రమాలు ఉంటాయని నిర్వాహకులు తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరు కావాలని కోరారు.